


# కెరటం న్యూస్




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 205 | సోమవారం 280 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. ఈ రోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోనేరు హంపిపై దివ్య దేశ్‌ముఖ్ విజయం సాధించింది. ఈ విజయంతో 19 ఏళ్ల దివ్య భారతదేశానికి చెందిన ఎనభై ఎనిమిదో గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది. దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జరిగిన తొలి ర్యాపిడ్ ట్రై బ్రేకర్ డ్రాగా ముగిసింది. అయితే ఆ తర్వాత రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో కోనేరు హంపిపై దివ్య గెలుపొందింది.

## వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటా..

**•బండి సంజయ్‌కి నితిన్ గడ్కరీ భరోసా**



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులను విడుదల చేయాలని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. సోమవారం న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అందులో భాగంగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు.

**•పాలనా గాలికి ప్రగతి కాటికి •పల్లెల్లో మద్యం దుకాణాల విస్తరణను వ్యతిరేకిస్తున్న కేటీఆర్ • ఆదాయం కోసం మద్యం అమ్మకాలపై ఆశ •తాగుబోతుల తెలంగాణ దిశగా కాంగ్రెస్ పాలన •ప్రగతికి బదులుగా మద్యం వ్యాపారం: కేటీఆర్**



# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ.. మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం దక్కించుకున్న తర్వాత ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నదని ధ్వజమెత్తారు. నాగు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్.

ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, ధరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయం. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## త్వరలో తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబోతున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## రూ.5 కోట్ల విలువైన గంజాయి పట్టివేత..

### 455 గంజాయి ప్యాకెట్లు సీజ్



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** గంజాయి పెడ్లర్స్ భరతం పడుతోంది ఈగల్ టీమ్. గంజాయి, డ్రగ్స్ రవాణాకు పాల్పడుతున్న వారి పట్ల ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ లో ఈగల్ టీమ్ భారీగా గంజాయిని పట్టుకుంది. ఏకంగా రూ. 5 కోట్లు విలువైన 935 కిలోల గంజాయిని సీజ్ చేసింది. బాటసింగరం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో ఈగల్ టీమ్ పట్టుకుంది. ఒడిశా నుంచి మహారాష్ట్ర కు తరలిస్తుండగా పట్టుకుంది. 35 సంచుల్లోని 455 గంజాయి ప్యాకెట్లు సీజ్ చేశారు.

## హెచ్‌సీఏ అక్రమాలపై సీబీఐ విచారణ చేయించాలి.. హైకోర్టులో పిటిషన్



## ఆ నిధులు పక్కదారి పట్టించారు

**- మంత్రి సీతక్క**



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు.

## బీసీ నాయకులు అందరూ సహకరించాలి

**•రాష్ట్రపతిని కలుసేందుకు బీసీ సంఘాలకి పిలుపు •బీసీలకు 42% రిజర్వేషన్లు కోరేవారు మాతో దిల్లీకి రావాలి: పొన్నం •ఆగస్టు 5-7 అపాయింట్ కోరిన తెలంగాణ ప్రభుత్వం •ఈడబ్ల్యూఎస్‌కి మినహాయింపు ఉంటే బీసీలకు ఎందుకు కాదు? • బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అన్ని పార్టీల మద్దతు కోరుతున్నాం: పొన్నం ప్రభాకర్**



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** తెలంగాణలో బిసి రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో మార్చి నెలలో ఆమోదించి గవర్నర్‌కు పంపినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మార్చి 22, 2025న బిల్లును గవర్నర్‌కు పంపించగా, గవర్నర్ మార్చి 30న బిల్ నంబర్ 3, బిల్ నంబర్ 4లను రాష్ట్రపతికి పంపినట్లు ఆయన వెల్లడించారు. జూలై 14న ఆర్డినెన్స్ ముసాయిదాను కూడా గవర్నర్‌కు పంపామని, గవర్నర్ నుండి సానుకూల నిర్ణయం వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలకు పంచాయతీ యాక్ట్ ప్రకారం తగిన నిధులు అందడం లేదని మంత్రిప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.




**•పాక్ ఉగ్ర శిబిరాలపై 22 నిమిషాల్లో దాడి: భారత సైన్య శౌర్యానికి ప్రపంచం సాక్ష్యం •పాకిస్థాన్‌ను వణికించిన ఆపరేషన్ సిందూర్ యుద్ధం లక్ష్యం కాదు.. ఉగ్రవాదుల నిర్మూలనే ధ్యేయం • భారత దాడులతో కాళ్లబేరానికి వచ్చిన పాక్ - రాజ్‌నాథ్ సింగ్**

# 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం : రాజ్‌నాథ్ సింగ్

**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను వణికించిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో వాడీవేడి చర్చ మొదలైంది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. "మే 7 రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయి. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపారు. మన సైనికులు ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశారు.

## డార్క్ వెబ్ సైట్ టూల్స్‌తో ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాడు..

**• సిట్ కు ఫిర్యాదు చేశానన్న ఆర్ఎస్పీ**



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** సిట్ విచారణకు హాజరైన బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రుల ఫోన్లను రేవంత్ రెడ్డి టాప్ చేస్తున్నారని సిట్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. రేవంత్ మాట్లాడిన వీడియో ఫుటేజ్ ఎవిడెన్స్ కూడా ఇచ్చానన్నారు.

రేవంత్ రెడ్డి ఫోన్లను టాప్ చేయడమే కాకుండా డార్క్ వెబ్‌లో అత్యంత ఖరీదైన సాఫ్ట్ వేర్ టూల్స్ ఉపయోగిస్తూ తమ సొంత మంత్రుల ఫోన్లను, ప్రతిపక్ష నేతల ఫోన్లను టాప్ చేస్తున్నారని సైడ్ పోస్ట్ పత్రిక రాసిందన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకే పెద్దపీట



**న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్):** చిత్తశుద్ధితో బీసీల కోసం పనిచేసేది ప్రధాని నరేంద్ర మోదీనేనని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. బీసీ కమిషన్ తీసుకొచ్చింది మోదీనేనని ఆయన తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి మాట్లాడిన ఆయన.. ' కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు కేటాయిస్తామన్నారు.. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశారు.. కానీ నివేదిక బయటపెట్టలేదు, తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారు. కేసీఆర్ కూడా 52 శాతం మంది కంటే ఎక్కువగా ఉన్నారని అసెంబ్లీలో నోరుజారారు. కానీ ఆయన 38 శాతం ఉన్నారని చెప్పాలని చూసి దొరికిపోయారు.

## హెచ్‌సీఏ అక్రమాలపై సీబీఐ విచారణ చేయించాలి.. హైకోర్టులో పిటిషన్



న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): సఫిల్‌గూడ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో చోటు చేసుకున్న ఆర్థిక అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఈ పిటిషన్ వేశారు. హెచ్‌సీఏ బాధ్యతలను బీసీసీఐకి అప్పగించేలా ఆదేశాలివ్వాలని ఇందులో కోరారు. ఈ నెల 19వ తేదీన నిర్వహించిన వార్షిక సమావేశం చెల్లదని ప్రకటించాలని అభ్యర్థించారు. హెచ్‌సీఏ బాధ్యతలను విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నవీన్ రావుకు అప్పగిస్తూ గత విచారణ సందర్భంగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మధ్యంతర ఉత్తర్వులు మూడు వారాల వరకు కొనసాగనున్నాయి.

## 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం : రాజ్‌నాథ్ సింగ్

సిందూర్ అనేది వీరత్వానికి, శౌర్యానికి ప్రతీక. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సైన్యానికి అభినందనలు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత.

**జమ్మూకశ్మీర్‌లో 'ఆపరేషన్ మహదేవ్'.. పహల్గాం దాడి ఉగ్రవాదుల హతం..?**

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైన్యం మనపై దాడికి దిగింది. దాయాది దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. మన సైనికులు మిసైళ్లతో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్‌లోని మిసైల్ లాంఛింగ్ స్టేషన్ ధ్వంసమైంది. శత్రువుల దాడులను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది. ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా సైనికులు దాడులు జరిపారు. ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం. భారత దాడులను అనేక దేశాలు సమర్థించాయి. సరిహద్దులు దాటి వెళ్లడం.. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే మా లక్ష్యం. యుద్ధం మా లక్ష్యం కాదు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడమే మా విధానం.

**కాళ్ల బేరానికి వచ్చిన పాక్**

మనం చేసిన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారు. మాతృభూమి రక్షణలో మన సైనికుల వీరత్వం కనిపిస్తోంది. భుజ్, ఉధంపూర్ స్థావరాలకు వెళ్లి మన సైనికుల సత్తా ప్రత్యక్షంగా చూశా. సైనిక సత్తాను ప్రశ్నించడం విపక్షాలకు సరికాదు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలి.

**స్నేహ హస్తం.. భారత్ గొప్పతనం**

1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయీ ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయీ లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయీ చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయీ తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరు.

**చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి**

ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటివరకు మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుంది" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

2025 ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా దివ్య నిలిచింది. చివరకు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దివ్యకు 1.5 పాయింట్లు లభించగా, కోనేరు హంపికి 0.5 పాయింట్లు వచ్చాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దివ్యకు హంపీ గట్టి పోటీనిచ్చింది. దీంతో ఫలితం ట్రైబ్రేకర్‌కు చేరింది. సోమవారం దూకుడుగా ఆడిన దివ్య టోర్నీ విజేతగా నిలిచి గ్రాండ్ మాస్టర్ హోదాను దక్కించుకుంది.

నాగ్‌పూర్‌కు చెందిన 19 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ సీనియర్ విభాగంలో చాలా తక్కువ టోర్నీలు మాత్రమే ఆడింది. కోనేరు హంపితో పోల్చుకుంటే దివ్య అనుభవం చాలా తక్కువ. ఈ టోర్నీకి ముందు ఆమెకు గ్రాండ్ మాస్టర్ హోదా కూడా లేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందిన దివ్య.. 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. అలాగే ఒలింపియాడ్‌లో మూడు స్వర్ణ పతకాలను కూడా అందుకుంది. తాజా ప్రపంచకప్‌లో తనకంటే మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక, జు జినర్ వంటి ప్రతిభావంతులను ఓడించి అందర్నీ ఆకట్టుకుంది.

## రూ. 5 కోట్ల విలువైన గంజాయి పట్టివేత.. 455 గంజాయి ప్యాకెట్లు సీజ్



న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): గంజాయి పెడ్లర్స్ భరతం పడుతోంది ఈగల్ టీమ్. గంజాయి, డ్రగ్స్ రవాణాకు పాల్పడుతున్న వారి పట్ల ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్ లో ఈగల్ టీమ్ భారీగా గంజాయిని పట్టుకుంది. ఏకంగా రూ. 5 కోట్లు విలువైన 935 కిలోల గంజాయిని సీజ్ చేసింది. బాటసింగరం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో ఈగల్ టీమ్ పట్టుకుంది. ఒడిశా నుంచి మహారాష్ట్ర కు తరలిస్తుండగా పట్టుకుంది. 35 సంచుల్లోని 455 గంజాయి ప్యాకెట్లు సీజ్ చేశారు.తెలంగాణ 2025లో అతి పెద్ద గంజాయి పట్టివేత ఇదే. గంజాయి ముఠాను గుట్టురట్టు చేసింది ఈగల్ టీమ్. ఖమ్మం–రాచకొండ నార్కోటిక్ పోలీసుల జాయింట్ ఆపరేషన్. టాటా ఐచ్చర్ వాహనంలో ఫలమండీ ట్రే క్రింద దాచిన గంజాయి.. గంజా రవాణాకు ఎస్కార్ట్ చేసిన టయోటా ఇన్నోవా..మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ముఠా పట్టుబడింది.. ముఠా సారధి పవార్ కుమార్ బాడు అరెస్ట్ అయ్యాడు.. సమాధాన్ భిస, వినాయక్ పవార్ అరెస్ట్.. మొత్తం 455 ప్యాకెట్ల గంజా, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ఫైనాన్సింగ్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఛేదించిన ఈగల్ టీమ్.. పరారిలోనే సప్లేయర్స్ సచిన్ గంగారాం చౌచౌహాన్, విక్కీ సేథ్ లు.

## ఆ నిధులు పక్కదారి పట్టించారు - మంత్రి సీతక్క

న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు.

ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని తెలిపారు మంత్రి సీతక్క.

అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకే పెద్దపీట

న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): చిత్తశుద్ధితో బీసీల కోసం పనిచేసేది ప్రధాని నరేంద్ర మోదీనేనని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. బీసీ కమిషన్ తీసుకొచ్చింది మోదీనేనని ఆయన తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి మాట్లాడిన ఆయన.. ' కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు కేటాయిస్తామన్నారు.. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశారు.. కానీ నివేదిక బయటపెట్టలేదు, తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారు. కేసీఆర్ కూడా 52 శాతం మంది కంటే ఎక్కువగా ఉన్నారని అసెంబ్లీలో నోరుజారారు. కానీ ఆయన 38 శాతం ఉన్నారని చెప్పాలని చూసి దొరికిపోయారు. ఇక కాంగ్రెస్ కుల గణన కొన్ని మండలాల్లో జరగనే లేదు. ఎలా పూర్తి చేశారు. నిజంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయటపెట్టలేదు. అందుకే కేంద్ర ప్రభుత్వం, జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనుంది.

రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తాం. 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తాం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు' అని రాంచందర్ రావు విమర్శించారు.

## త్వరలో తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగి లో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఆంధోల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తారు.

ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతోపాటు కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరు లో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటుంది. ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండి లో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేట లో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.

## బనకచర్లపై కేంద్రం కీలక ప్రకటన



న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): బనకచర్ల ప్రాజెక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక - ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టును రూ. 81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన దస్త్రాన్ని కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది.

ఆ తర్వాత.. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలు ఈ సందర్భంగా వీరు చర్చించారు. అనంతరం ఈ అంశంపై నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల భారీ నీటి పారుదల శాఖ మంత్రులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## డార్క్ వెబ్ సైట్ టూల్స్‌తో ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాడు..

న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): సిట్ విచారణకు హాజరైన బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రుల ఫోన్లను రేవంత్ రెడ్డి టాప్ చేస్తున్నారని సిట్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. రేవంత్ మాట్లాడిన వీడియో ఫుటేజ్ ఎవిడెన్స్ కూడా ఇచ్చానన్నారు.

రేవంత్ రెడ్డి ఫోన్లను టాప్ చేయడమే కాకుండా డార్క్ వెబ్‌లో అత్యంత ఖరీదైన సాఫ్ట్ వేర్ టూల్స్ ఉపయోగిస్తూ తమ సొంత మంత్రుల ఫోన్లను, ప్రతిపక్ష నేతల ఫోన్లను టాప్ చేస్తున్నారని సైడ్ పోస్ట్ పత్రిక రాసిందన్నారు. కాబట్టి ఆ మంత్రులను కూడా విచారణకు సిట్ అధికారులు పిలిపించాలని డిమాండ్ చేశారు. వాళ్ల ఫోన్లను కూడా పరిశీలించాలని, వాళ్ల ఫోన్లను ఫోరెన్సిక్ నిపుణులతో పరిశీలించాలన్నారు. వాళ్ల ఫోన్లలోకి ఏ విధంగా సాఫ్ట్ వేర్ మాల్వేర్ పంపించారు అనేదానిపై పూర్తి విచారణ జరగాలని అన్నారు.

## వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటా.. బండి సంజయ్‌కి నితిన్ గడ్కరీ భరోసా

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట–ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి–పోతూర్ రోడ్డు విస్తరణ పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అట్లాగే కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయి. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. గత ఎన్నికలకు ముందే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం కేంద్రం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం పొందడంతోపాటు టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్– జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జిల నియామకం



న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు కోలీజియం ఇటీవల చేసిన సిఫారసులను ఆమోదిస్తూ, నలుగురు కొత్త జడ్జిల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో హైకోర్టులో న్యాయ వ్యవస్థ మరింత బలపడనుందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ నియామకాలతో గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ తదితరులు త్వరలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసుల ఆధారంగా న్యాయవాదుల అనుభవం, నిబద్ధత, న్యాయపరమైన ప్రతిభను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ ఎంపికలు జరిగాయి.

ఇటీవల కేసుల పెరుగుదలతో హైకోర్టులో న్యాయమూర్తుల కొరత సమస్యగా మారింది. ఈ కొత్త నియామకాలు కేసుల విచారణను వేగవంతం చేయడంలో, పెండింగ్ కేసుల క్లియరెన్స్‌లో సహాయపడతాయని న్యాయ నిపుణులు విశ్వసిస్తున్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై మానవహక్కుల కమిషన్ ఆగ్రహం




న్యూస్ డెస్క్, 28 జూలై (కెరటం న్యూస్): సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై తెలంగాణ మానవహక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లోని వార్తల ఆధారంగా ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. సరోగసీ చిన్నారుల విక్రయాన్ని తీవ్రంగా పరిగణించాలన్న ఎస్‌హెచ్‌ఆర్సీ.. దీనిపై విచారణ జరిపి ఆగస్టు 28లోగా నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది.

సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్, సరోగసీతో పిల్లల్లేని కొరత తీర్చుతామంటూ శిశు విక్రయాలు సాగిస్తున్న సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

## బీసీ నాయకులు అందరూ సహకరించాలి



"రాష్ట్రంలోని బీజేపీ నాయకత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్ పాస్ చేయించాలి" అని ఆయన అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలను బీసీ నాయకత్వం ఖండించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు సహేతుకంగా ఉండడం లేదని ఆయన విమర్శించారు.ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతిని కలవడానికి అపాయింట్‌మెంట్ కోరుతున్నట్లు మంత్రిప్రభాకర్ తెలిపారు. "తెలంగాణ బీసీ నాయకులు ఈ కీలక సమయంలో ఢిల్లీలో పాల్గొనాలి," అని పిలుపునిచ్చారు."50 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాలకు స్వయంగా ముందుకు వెళ్లే అవకాశం ఉందని, ఇందిరా సహనీ కేసులో ఇదే స్పష్టం అయింది," అని మంత్రి పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఎలాంటి సందేహాలు పెట్టుకోకూడదని ఆయన స్పష్టం చేశారు.కిషన్ రెడ్డిని ఉద్దేశించి "మీ పదవులకు ఇబ్బంది లేదు, మీ స్థానాల్లో మీరే ఉండండి" అని వ్యాఖ్యానించారు. ఆర్ కృష్ణయ్య మౌనం వహించకూడదని, ఆయన పార్టీ ఎంపీలను ఢిల్లీకి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రాజకీయ ఎదుగుదలకు ఈ బిసి రిజర్వేషన్ బిల్ ఎంతో ఉపయుక్తం అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. "ఆగస్టు 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో జరిగే కార్యక్రమాలకు అన్ని పార్టీల బిసి నేతలు తరలి రావాలి," అని ఆయన పిలుపునిచ్చారు.

# ఫీజులు చెల్లించకపోతే సచివాలయం ముట్టడిస్తాం

## విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు చెల్లించకపోతే ఊరుకునేది లేదని హెచ్చరిక

**రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు నిర్వహిస్తాం**

**వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన**

**డాక్టర్ వివేక్, డిఎస్ఎఫ్ఐ జాతీయ కన్వీనర్**



**కొత్తగూడెం, 28 జూలై (కెరటం న్యూస్):** భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (డిఎస్ఎఫ్ఐ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న 8600 కోట్ల రూపాయల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్, డైట్ బిల్లులు విడుదల చేయాలని, పలు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని చలో కలెక్టరేట్ నిర్వహించారు. తొలుత కెఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి నూతన కలెక్టరేట్ కార్యాలయం వరకు వేలాది మంది విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎస్ఎఫ్ఐ జాతీయ కన్వీనర్ డాక్టర్ వివేక్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 8600 కోట్ల రూపాయల స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని,



బడ్జెట్ ప్రైవేట్ కళాశాలలో మూతపడుతున్నాయని, యాజమాన్యం తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని, 5 నెలల కాలంలో పెండింగ్లో ఉన్న డైట్ బిల్లులు విడుదల చేయాలని, రాష్ట్రంలో రెగ్యులర్ ఎంఈఓ డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రి నియమించాలని, రాష్ట్ర యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో పెండింగ్లో ఉన్న మధ్యాహ్న భోజన పథక పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, గురుకులాల్లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ ఘటనలపై విచారణ జరిపించాలని, విద్యార్థుల మరణాలను ఆపాలని కోరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోనున్న ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బి వీరభద్రం, కేళోత్ సాయికుమార్, మాలోత్ శాంత్ కుమార్, గుగులోత్ సూర్య ప్రకాష్, భూక్య శ్రీకాంత్, సిహెచ్ రామచరణ్, గుగులోత్ శివ వర్మ, దేవేందర్, వీరేష్, దినేష్, దిలీప్, జవహార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# వనమహోత్సవం లో భాగంగా 204 మొక్కలను నాటిన సింగరేణి సీఎండి



**కొత్తగూడెం, 28 జూలై (కెరటం న్యూస్):** వనమహోత్సవంలో భాగముగా సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరాం, ఐఆర్ఎస్ ఇల్లందు బంగ్లాస్ నందు నూతనంగా నిర్మించిన ఎంఏ టైప్ నివాస గృహ సముదాయ ప్రాంగణంలో సోమవారం నాడు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ వన మహోత్సవంలో భాగముగా సింగరేణిలో కూడా మనం పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రతీ అడుగు పచ్చదనం అనే నినాదం తో సమీప గ్రామాలలో, మైన్లు మరియు డిపార్ట్మెంట్లలో అలాగే ఓబి డంప్ లలో మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యం పాటిస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరం సింగరేణి సంస్థ 675 హెక్టార్లలో 40.00 లక్షల మొక్కలను పెంచాలనే లక్ష్యం తో సింగరేణి సంస్థ వ్యాప్తముగా గనులలో, ఓబి డంప్ లలో మొక్కలను నాటుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగముగా సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ ఒక్కరే కొత్తగూడెం ఇల్లందు బంగ్లాస్ నందు నూతనంగా నిర్మించిన ఎంఏ టైప్ నివాస గృహ సముదాయ ప్రాంగణం ప్రాంగణం లో 204 వివిధ రకాల పండ్ల మొక్కలను(సీతా ఫలం, వాటర్ ఆపిల్, నేరేడు, సపోటా, రామ సీతాఫలం) నాటారు. ఈ రోజు నాటిన మొక్కలతో కలిపి మొత్తం సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ సింగరేణి వ్యాప్తముగా మొత్తం 19,804 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ తో పాటు డైరెక్టర్ ( ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పి,పి) కే.వెంకటేశ్వర్లు, జిఎం (సిపిపి) ఏ.మనోహర్, జిఎం (ఎన్విరాన్మెంట్) బి.సైదులు, జిఎం(ఎస్టేట్స్) ఎన్.రాధా కృష్ణ, జిఎం(క్వాలిటి) ఏ.రవి కుమార్, జిఎం (స్టోర్స్) పి.ఎలిషా, జిఎం (ఎక్స్ప్లోరేషన్) బి.శ్రీనివాస రావు, జిఎం(పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(సెక్యూరిటీ) సిహెచ్.లక్ష్మీనారాయణ, జిఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, జిఎం(పర్సనల్) ఈఈ సెల్ ఏజేఎం మురళీధర్, అధికారులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



# పేదలకు సన్నబియ్యం పంపిణి నిర్ణయం హర్షణీయం

**కొత్త రేషన్ కార్డుల జారీ సాహసోపేత నిర్ణయం**

**కొత్త కార్డులు జారీచేస్తే సరిపోదు..లబ్దిదారులకు తక్షణమే బియ్యం కేటాయించాలి**

**ఎన్నికల హామీ మేరకు అన్ని రకాల నిత్యావసరాలు అందించాలి**

**నియోజకవర్గంలో 4500 కొత్తరేషన్ కార్డులు అందిస్తున్నాం**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం, 28 జూలై (కెరటం న్యూస్):** ఎన్నికల హామీ మేరకు తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నం బియ్యం పంపిణి పథకం అమలు చేయడాన్ని హర్షిస్తున్నామని, సన్నబియ్యం నాణ్యతను మరింత పెంచి పెదలు కడుపునిండా తిండి తినేలా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సంబందించిన లబ్దిదారులకు వారికి మంజూరైన తెల్ల రేషన్ కార్డులకు సోమవారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ ఇప్పటికే చాలా జాప్యం జరిగిందని, కొత్త రేషన్ కార్డుల జారీతో చేతులు దులుపుకుంటే సరిపోదని, తక్షణమే బియ్యం కేటాయింపు జరగాలన్నారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిత్యావసరాల పంపిణి చేపట్టాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8000మంది కుటుంబ సభ్యుల చేర్పింపుతో 4500 కొత్త రేషన్ కార్డులు లబ్దిదారులకు అందిస్తున్నామని, ఇప్పటి వరకు పాత రేషన్ కార్డుల్లో 8000 మంది చేర్పింపు జారింది తెలిపారు. కార్డుల ప్రక్రియ నిత్య ప్రక్రియలా కొనసాగేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అర్హులైన ప్రతి పెద్ద కుంటుంబాని అందేలా చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, చుంచుపల్లి, డిఎస్ఓ రుక్మిణి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్లు రామకృష్ణ, ప్రసాద్, శిరీష, ఎంపిడివోలు శుభాసీని, భారతి, అంకుబాబు, హన్మంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, దస్రు, కుమారి హన్మంతరావు, చుంచుపల్లి మండల కర్యదర్శి వాసిరెడ్డి మురళి, దీటి లక్ష్మిపతి, జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, పొలమూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి, చింతలపూడి శేఖర్, ధర్మారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# మద్దెల ఆధ్వర్యంలో హరిహర వీరమల్లు విజయోత్సవ సంబురాలు

## కేకును కట్ చేసిన ముఖ్యఅతిథి ,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు చిన్ని



**కొత్తగూడెం, 28 జూలై (కెరటం న్యూస్):** నేడు ధార్మిక విలువలు, నైతిక విలువలు మృగ్యమై, బాధ్యతలు బంధాలు అంతరించిపోతున్న ఈ రోజుల్లో, అన్ని మతాలు కలిసిమెలిసి జీవించే - సమైక్య జీవనాన్ని, బాధ్యతలను ధార్మిక విలువలను నైతిక విలువలను ప్రతిబింబిస్తూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అద్భుతంగా నటించిన, ప్రథమ పాన్ ఇండియా మూవీ" హరిహర వీరమల్లు"ను ప్రతి ఒక్కరూ చూసి ఆదరించడమే కాకుండా ఇతరులకు కూడా చూపించాలని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) ఉద్ఘాటించారు. విశ్వవ్యాప్తంగా పాన్ ఇండియా మూవీగా రిలీజ్ అయిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చిత్రం "హరిహర వీరమల్లు" అన్ని వర్గాల వారిని అలరిస్తూ సూపర్ హిట్ టాక్ లో దూసుకు బోతున్న శుభ సందర్భంగా అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, మైటీ మెగాస్టార్ వీరాభిమాని కార్యక్రమ రూపశిల్పి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో స్థానిక పరమేశ్వరి థియేటర్లో రాత్రి ఫస్ట్ షో ముగిసిన తర్వాత ఏర్పాటుచేసిన విజయోత్సవ కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోనేరు చిన్ని హాజరై , తమ సందేశాన్ని అందించి కేకును కట్ చేసి అందరికీ పంచి, కార్యక్రమ నిర్వాహకులకు మరియు చిత్ర యూనిట్కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేకులను స్వీట్లను అందరికీ పంచిపెట్టారు. ఈ అద్భుతమైన కార్యక్రమంలో శ్రీ కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ,బి విల్సన్ బాబు, అపరబాలు అల్లి శంకర్, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుగులోత్ కృష్ణ, కోనేరు ప్రకీర్త్, ప్రముఖ న్యాయవాదులు గోపికృష్ణ ,బాబురావు పరమేశ్వరి థియేటర్ మేనేజర్ శ్రీనివాస్, పవన్ కళ్యాణ్ వీరాభిమాని మధు , జాన్, సాంబ ,అభిమానులు, థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.



# కారేపల్లి మండల కేంద్రంలో కలెక్టర్ అనుదీప్ ఆకస్మిక తనిఖీలు



**కారేపల్లి,28 జూలై (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి మండల కేంద్రంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా కారేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి పరిసరాలను పరిశీలించారు. స్కూల్ ఆవరణంలో చెత్తాచెదారం, దుర్వాసనతో కూడిన అపరిశుభ్రత నెలకొనడంతో ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ లు, పుస్తకాలు, విద్యార్థుల యూనిఫామ్, క్రీడా సామగ్రి నిల్వ ఉంచే గదులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లోకి ప్రవేశించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో పుస్తకాల్లోని పాఠాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులను భోజనశాలలో కలిసి రుచి, ప్రామాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పదో తరగతి ఉత్తీర్ణ శాతం పెంచడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అదేవిధంగా కారేపల్లి సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. సొసైటీ ద్వారా రైతులకు అందజేస్తున్న ఎరువులను పరిశీలించారు. ఎరువుల పంపిణీలో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని సొసైటీ సీఈఓకు సూచించారు. అనంతరం కారేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీ కి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు గ్రామాల్లో అవగాహనలు కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

సీజనల్ వ్యాధుల నివారణ పట్ల గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట మండల తాసీల్దార్ అనంతుల రమేశ్, ఎంపీడీఓ రవీంద్ర ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి జయరాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, ఆర్ఐ నరసింహారావు, ఎస్ఐ గోపి, మండల వైద్యాధికారి బి.సురేశ్, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ నరేందర్ ఉన్నారు.

# ఫైనల్ టెస్ట్‌కు బుమ్రా ఫిట్

స్పోర్ట్స్ న్యూస్,28 జూలై (కెరటం న్యూస్): భారత్ బౌలింగ్ దళాన్ని కొన్నాళ్లుగా ఆందోళనకు గురిచేస్తున్న సమస్య తీరిపోయింది. ఇంగ్లాండ్‌తో ఓవల్ మైదానంలో జరగనున్న తుదిటెస్ట్‌కు ఏస్ బౌలర్ బుమ్రా ఫిట్‌గా ఉన్నాడని కోచ్ గౌతమ్ గంభీర్ ప్రకటించాడు. అంతేకాదు.. స్టార్ బౌలింగ్ దళం మొత్తం తుదిపోరుకు సై అంటోందని వెల్లడించాడు.



ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌లో తొలి సిరీస్‌ను డ్రా చేయాలంటే మాత్రం ఈ మ్యాచ్ చాలా కీలకం. ఓవల్ మ్యాచ్ ఫలితం తేలడంలో జెస్సీ పాత్ర కీలకమని భారత్ బలంగా విశ్వసిస్తోంది. ఇప్పటికే ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒక్క దానికి మాత్రమే అతడు విశ్రాంతి తీసుకొన్నాడు.

ఇక మూడో టెస్ట్ తర్వాత గాయపడిన ఆకాశ్‌దీప్ మ్యాచ్‌లకు దూరంగా అర్ష్‌దీప్ కూడా అందుబాటులో ఉంటారని గౌతీ పేర్కొన్నాడు. సీమర్లలో అందరూ ఫిట్‌గా ఉన్నట్లు వెల్లడించాడు. గాయాలబాధ లేదన్నాడు. ఇక కాంబినేషన్లపై ఇప్పుడే ఎటువంటి చర్చలు జరపడం లేదని చెప్పారు. బుమ్రా ఆడతాడా, లేదా అనే దానిపై కూడా నిర్ణయం తీసుకోలేదు. తుది జట్టులో ఎవరైతే ఉంటారో.. వారు దేశం కోసం తమ పూర్తి శక్తిసామర్థ్యాలతో ఆడాలని వెల్లడించాడు.

ఇక విలేకర్లు కెప్టెన్ గిల్ ను బుమ్రా తుది టెస్ట్ ఆడే విషయంపై ప్రశ్నించగా.. చివరి మ్యాచ్‌కు ఆ విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. "బుమ్రా తుది మ్యాచ్‌కు అందుబాటులో ఉంటే.. అది మాకు గొప్ప విషయం. ఒకవేళ అతడు ఆడకపోయినా.. మా వద్ద మెరుగైన బౌలింగ్ అటాక్ దళం ఉంది" అని వ్యాఖ్యానించాడు.

స్టోక్స్‌పై గంభీర్ కామెంట్స్..

నాలుగో టెస్ట్ ఐదో రోజు కరచాలన వివాదంపై టీమ్ ఇండియా కోచ్ గంభీర్ స్పందించాడు. టీమ్ ఇండియా నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించాడు. ఎవరైనా 90 లేదా 85 పరుగుల వద్ద ఆడుతుంటే.. వారు శతకాలకు పూర్తిగా అర్హులు. ఈ మైలు రాళ్ల వద్ద వాళ్ల ఆటగాళ్లు ఉంటే ఇంగ్లాండ్ ఆటను ఆపి.. డ్రా చేసుకొని మైదానాన్ని వీడేదా..? లేదు. మా ఆటగాళ్లు అద్భుతంగా ఆడి ఆ మైలురాళ్లను సాధించారు. ఎవరి దయతోనూ కాదు" అని పేర్కొన్నాడు.

మ్యాచ్ మధ్యలో ఆటగాడు తీవ్రంగా గాయపడిన వేళ రీప్లేస్‌మెంట్లు ఉండకూడదు. అదో హాస్యాస్పద విషయం అంటూ బెన్‌స్టోక్స్ మ్యాచ్ అనంతరం చేసిన కామెంట్స్‌ను గౌతీ వ్యతిరేకించాడు. " ఒకవేళ మ్యాచ్ అంపైర్లు, రెఫరీ పరిశీలించి భారీ గాయంగా భావిస్తే.. సబ్‌స్టిట్యూట్ తీసుకొనేలా నిబంధన ఉండటం చాలా కీలకం. దీనిలో తప్పు ఏమీ లేదు. ముఖ్యంగా ఇలాంటి ఉత్కంఠ సిరీసుల్లో ఇది చాలా కీలకం. 10తో 11 మందిపై ఆడటాన్ని ఊహించుకోండి. ఇలాంటిది మాకు ఎంత ఇబ్బందికరమో అర్థమవుతుంది" అని పేర్కొన్నాడు. నాలుగో టెస్ట్ మధ్యలో కీపర్ పంత్ తీవ్రంగా గాయపడి మైదానానికి దూరమైన విషయం తెలిసిందే.

అప్పుడు బుమ్రాను అన్నారు.. ఇప్పుడు ఇంగ్లాండ్‌కు బెన్‌స్టోక్స్ దిక్కా?

ఇక మ్యాచ్ చివరిరోజు ఇంకా 15 ఓవర్లు ఉండగానే ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ కరచాలనం ఇస్తూ.. మ్యాచ్‌ను డ్రాగా ముగించాలని భావించాడు అప్పటికి రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ క్రీజులో ఉన్నారు. వీరు శతకాలకు చాలా చేరువలో ఉన్నారు. దీంతో తిరస్కరించి.. మ్యాచ్ కొనసాగించి శతకాలు పూర్తి చేశారు. దీనిపై స్టోక్స్ అసంతృప్తి వ్యక్తంచేశాడు.

# సౌత్‌జోన్ కెప్టెన్‌గా తిలక్‌వర్మ

స్పోర్ట్స్ న్యూస్,28 జూలై (కెరటం న్యూస్): హైదరాబాద్ స్టార్ క్రికెటర్ ఠాకూర్ తిలక్‌వర్మ..దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లండ్ కౌంటీల్లో నిలకడగా రాణిస్తున్న తిలక్‌వర్మ..వచ్చే నెలలో జరుగనున్న దులీప్‌ట్రోఫీలో సౌత్‌జోన్ టీమ్‌కు నాయకత్వం వహించనున్నాడు. ప్రస్తుతం కౌంటీల్లో హంప్‌షైర్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న తిలక్ నాలుగు మ్యాచ్‌ల్లో వరుసగా 100, 56, 47, 112 పరుగులతో దుమ్మురేపుతున్నాడు.



తిలక్ ప్రదర్శనను పరిగణనలోకి తీసుకున్న సెలెక్టర్లు కెప్టెన్‌గా అవకాశం కల్పించారు. హైదరాబాద్ నుంచి తిలక్‌తో పాటు తన్మయ్ అగర్వాల్ చోటు దక్కించుకున్నాడు. గత రంజీ సీజన్‌లో నిలకడగా రాణించిన నలుగురు కేరళ క్రికెటర్లు అజారుద్దీన్, నిదీశ్, బాసిల్, సల్మాన్ నిజార్..16 మందితో కూడిన సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు.

# అదే నా డ్రీమ్ రోల్..

మూవీ న్యూస్, 28 జూలై (కెరటం న్యూస్): ప్రముఖ నటీమణి శృతి హాసన్ ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ మూవీలో టాలీవుడ్ కింగ్ నాగార్జున విలన్ పాత్రలో కనిపించనుండగా, ఉపేంద్ర, అమీర్ ఖాన్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో శృతి హాసన్ బిజీగా పాల్గొంటున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, తన పాత్రపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు.



ఓ ఆల్బమ్ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు లోకేష్ కనగరాజ్‌ను కలిసిన శృతి, అప్పుడే 'కూలీ' స్క్రిప్ట్ గురించి విన్నట్లు చెప్పారు. అందులో స్ట్రాంగ్ ఉమెన్ క్యారెక్టర్ గా కనిపించే అవకాశం తనకు చాలా బాగా నచ్చిందని పేర్కొంది. ఆమె ఈ చిత్రంలో సత్యరాజ్ కుమార్తె పాత్ర పోషిస్తోంది. అంతేకాదు 'రజనీకాంత్, నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి పెద్ద స్టార్లతో స్క్రీన్ షేర్ చేసుకోడం నాకు ఎంతో గొప్ప అనుభూతినిచ్చింది, ఈ జర్నీ నా కెరీర్‌లో ఓ ప్రత్యేకం. ఇక నాకు సంగీతం అంటే ప్రాణం , సినిమాల్లో ఓ మ్యూజిషియన్ పాత్ర చేయాలన్నదే నా చిరకాల కోరిక' అని తెలిపింది ఈ ముద్దుగుమ్మ. ఈ కామెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. "పాప టేస్ట్ అదిరిపోయిందిగా!" అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# ఓటీటీలోకి సస్పెన్స్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!



మూవీ న్యూస్, 28 జూలై (కెరటం న్యూస్): సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'అరేబియా కడలి' .. సూర్యకుమార్ దర్శకత్వంలో ఇది రూపొందింది. స్టార్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దీనికి రైటర్‌గా పని చేయడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించారు. దీంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. తాజాగా దీని స్ట్రీమింగ్ వివరాలను అమెజాన్ పంచుకుంది. ఆగస్టు 8 నుంచి అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది.

తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానున్నట్లు అమెజాన్ ప్రైమ్ తెలిపింది. 'కాలానికి అందరూ సమానమే. అందరూ ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సిందే' అంటూ పోస్టర్‌ను పంచుకుంది. రెండు గ్రామాలకు చెందిన కొందరు మత్స్యకారులు అనుకోకుండా బార్డర్ క్రాస్ చేస్తారు. దీంతో వాళ్లను విదేశీ జైల్లో బంధిస్తారు. అక్కడినుంచి వాళ్లు ఎలా బయటకు వచ్చారనే కథాంశంతో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఇది రూపొందింది. 2024లోనే దీని చిత్రీకరణ ప్రారంభించారు. అయితే ఇటీవల ఇదే కథాంశంతో కొన్ని చిత్రాలు రూపొందినప్పటికీ ఈ కథ ఒరిజినల్ అని సంస్థ పేర్కొంది. ఇందులో సత్యదేవ్ సరసన ఆనంది నటించారు.

# నా ఆనందానివి నువ్వు

మూవీ న్యూస్, 28 జూలై (కెరటం న్యూస్): "నువ్వు నా భాగస్వామి అయితే.. ఆ గుడిసె గుడిలా మారుతుంద"ని అంటూ తన ప్రియుణ్ని పొగడ్తలతో ముంచెత్తుతుంది నిత్యామేనన్. ఇదంతా ఆమె నటిస్తున్న 'ఇడ్లీ కడై' (ఇడ్లీ కొట్టు) చిత్రం కోసమే. తమిళ హీరో ధనుష్ నటిస్తూ.. దర్శకత్వం వహిసున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి సింగిల్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'ఎన్న సుగం..' అంటూ మొదలైన ఈ పాటలో నిత్య, ధనుష్‌ల ప్రేమ కబుర్లు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. జీవీ ప్రకాశ్ సంగీతమందించిన ఈ గీతాన్ని శ్వేతామోహన్‌తో కలిసి ధనుష్ స్వయంగా ఆలపించారు. 'నువ్వే నా ఆనందానివి..' అంటూ గ్రామీణ నేపథ్యంలో సాగుతోందీ పాట. ప్రకాశ్ రాజ్, శాలినీ పాండే, సముద్రఖని తదితరులు నటిస్తున్న ఈ సినిమా అక్టోబరు 1న విడుదల కానుంది. డాన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

